

# ఆసరా

వారణాసి నాగలక్ష్మి

రాత్రి ఎనిమిది గంటలు కావస్తోంది. దేశంలోకెల్లా అతి ప్రముఖమైన ఫ్యాషన్ మ్యాగజైన్ని రూపొందించే సంస్థ కార్యాలయం. తదేక దీక్షతో కంప్యూటర్ ముందు కూర్చుని, స్క్రీన్ మీదున్న అందమైన అమ్మాయి ఫోటోని ఫోటోషాప్ సాఫ్ట్‌వేర్ ఉపయోగించి మెరుగులు దిద్దుతోంది పాతికేళ్ల అమ్మాయి.

గోధుమ రంగు మంగళగిరి చీరలో ఆమె శరీరం నిరాడంబరంగా ఉన్నా కాంతులీనుతోంది. ఆ కళ్లలో చేసే పని పట్ల శ్రద్ధ, చేస్తున్న పని పూర్తి చేయాలనే పట్టుదల, అనుకున్నది సాధించే దాకా రాజీపడని తత్వం కనిపిస్తున్నాయి. కంప్యూటర్ స్క్రీన్ మీదున్న మోడల్‌తో పోటీ పడగల రూపురేఖలున్నా, ఆ విషయం పట్ల గమనింపు లేనట్టుగా పనిలో నిమగ్నమై ఉందామె.

మోడల్ 'రాగిణి' తాలూకు ఒరిజినల్ ఫోటో స్క్రీన్ ఒక మూల సెట్ చేసి ఉంది. పైన 'రాగిణి వన్' అని పేరు కనిపిస్తోంది. స్క్రీన్ మధ్యలో పెద్దగా ఉన్న బొమ్మలో ఆ ఫోటో పోలికలే ఉన్నా, ఎవరో గ్రేట్ మాస్టర్ వేసిన పెయింటింగులా, చూసేవాళ్లని మంత్రించి నిలబెట్టేసేలా ఉంది! సాధారణమైన ఫోటోలని స్కాన్ చేసి, ఫోటోషాప్ సహాయంతో వాటిని అద్భుతమైన పెయింటింగ్స్‌లా మలచడంలో గొప్ప నైపుణ్యం ఉందామెకు. అందుకే పాతికేళ్లకే మంచి జీతం, చక్కని ఉద్యోగం మాత్రమే కాకుండా, మల్టీమీడియా రంగంలో తనకో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది.

ఆరోజు పొద్దుటి నుంచి అదే ఫోటోతో ప్రయోగాలు చేస్తుందామె. రకరకాల ఫిల్టర్స్ వాడి, అనేక రకాల ఎఫెక్ట్స్ సృజిస్తూ, ఒక్కటే ఫోటోని వాన్‌గోగ్ వేసిన తైల వర్ణ చిత్రంలా, అంబాదాస్ వేశారేమో అనిపించే నీటి రంగు చిత్రంలా, రవివర్మగారి సాంప్రదాయిక చిత్రంలా, త్రీడీ రిలీఫ్ వర్క్‌లా, రేఖా చిత్రంలా, నఖ చిత్రంలా... ఎన్నో విధాల చిత్రాలు తయారుచేస్తూ, ఒక చిత్రం కింద నుంచి మరో చిత్రం పాక్షికంగా కనిపించేలా పొరలుగా అమరుస్తూ ఏదో అద్భుతాన్ని సృష్టించాలని తదేక శ్రద్ధతో ప్రయత్నిస్తోంది. ఆ చిత్రాలన్నిటికీ వరుసగా రాగిణి టూ, రాగిణి త్రీ... అలా పేర్లు పెట్టి, ప్రస్తుతం రాగిణి సెవన్, రాగిణి టెన్‌ల మధ్య ఏది బావుందో మార్చి మార్చి చూసుకుంటుంటే సెల్‌ఫోన్ మోగింది.

ఏ దివిలో విరిసిన పారిజాతమో... రింగ్‌టోన్‌గా వినిపిస్తోంది. ఒక క్షణం అయోమయంగా చూసి, తన ఫోనే అని గుర్తుపట్టి, విసుక్కుంటూ ఆన్ చేసి చెవి కానించుకుంది.

"హాయ్ పారిజాతం!" మంద్రస్థాయి స్వరంలో చిరునవ్వు వినిపించింది.

స్క్రీన్ మీద నుంచి దృష్టి తిప్పకుండా అన్యమనస్కంగా,

"ఊఁ... ఏమిటి నువ్వు? నా సెల్‌తో ఎందుకు మెడిల్ చేస్తావు? రోజుకో రింగ్‌టోన్ పెడితే ఎంత తికమకగా ఉంటుంది?" కొంచెం కోపంగా, కొంచెం గారంగా ఉన్న ఆ గొంతు వింటూ ఇష్టంగా నవ్వాడు ప్రమోద్.

"ఏ రోజుకారోజు నిన్ను తలుచుకోగానే ఏ పాట గుర్తొస్తే, ఆ పాట రింగ్‌టోన్‌గా సెట్ చేస్తాను. అయినా తికమక ఎందుకు? ఈ ఫోన్ నీకిచ్చింది కేవలం నా కాల్స్ అందుకోడానికే. వేరేవాళ్లు ఎవరైనా నీ ఆఫీస్ ఫోన్‌కి చెయ్యాల్సిందే."

''సర్లే... ఏమిటో చెప్పు,'' రాగిణి టెన్‌నే చివరగా క్లిక్ చేసి, ఎన్నిక చేసుకుంటూ అంది.

''ఎనిమిదైంది తెల్సా? ఇంకా ఆఫీసులోనే వున్నావు?''

''ఊ... ఇంకా అవలేదు... అదే... అయిపో వచ్చింది,'' తడబడుతూ అంది.

''ఎవరి ఫోటో? పొద్దుటి రాగిణి ఎలా వచ్చింది?''

''అదే చేస్తున్నా.''

''ఆఁ...! ఇంకానా? ఇంతసేపా? గంటకు రెండు చేసేదానివి, ఈ ఒక్కటే రోజంతా, పైగా ఓవర్‌టైం చేస్తూ... ఏమిటి విశేషం?'' ఆశ్చర్యంగా అడిగాడు.

''ఏమో! ఏదీ నచ్చలేదు. అయినా కాసేపట్లో కలుసుకోబోతూ ఫోన్‌లో ఈ చర్చెందుకు? వృధా ఖర్చు. పెట్టేద్దూ...'' అంది, కంప్యూటర్‌కి కలిపి ఉన్న సూపర్ పెన్‌తో పాడ్ మీద అలవోకగా కొన్ని గీతలు గీస్తూ.

''ఇంక ఆపెయ్ పారిజాతం! నా పనైపోయింది. మీ ఆఫీస్‌కి వచ్చేస్తున్నా, కలిసి పోదాం.''

''ఇంత దూరం ఎందుకు ప్రమోద్? ఆఫీస్ వాన్‌లో వచ్చేస్తా...''

''నో క్వశ్చెన్స్... రాగిణిని కాపాడేసి (సేవ్ చేసి), డబ్బా మూసేసి (కంప్యూటర్ షట్‌డౌన్ చేసి) రెడీగా వుండు. మీ గేటు దగ్గర ఉన్నా,'' అంటూ సెల్ ఆఫ్ చేశాడు ప్రమోద్. మోనాలిసా నవ్వుతో మళ్లీ పనిలో పడిందామె. పాడ్ మీద సూపర్‌పెన్‌తో గీసిన గీతలు స్క్రీన్‌కు తరలి వెళ్లాయి. రాగిణి టెన్‌కి అనుసంధాన మయ్యాయి. పొరలుగా అమర్చిన ఆ కళాకృతిలో లేయర్ వన్, టూ అంటూ అనేక లేయర్స్‌ని క్లిక్ చేస్తూ మధ్యలో ఒక లేయర్ని డిలీట్ చేసి, చివరికి తనకు నచ్చిన విధంగా చిత్రాన్ని స్థిరపరచింది.

చివరగా కలిపిన గీతలతో రాగిణి బొమ్మ రెండు నల్లని ముళ్ల వెనుకగా అందమైన గులాబీలా కనిపించింది.

'సో స్వీట్!' పైకే అంటూ మెత్తగా ఓ ఫ్లయింగ్ కిస్ విసిరింది స్క్రీన్‌కి. మళ్లీ మరో ఫిల్టర్ ఎఫెక్ట్ కోసం మౌస్ కదుపుతుంటే,

''హేయ్! ఇంకా అవలేదా?'' అడుగుతూ లోపలికొచ్చాడు ప్రమోద్.

సమాధానంగా, 'ఊఁ,' అంది తల తిప్పకుండా.

''ఇంక ఆపవోయ్! రేపు చెయ్యొచ్చు,'' వెనుక నుంచి ఆమె మీదుగా వంగి మౌస్ మీదున్న ఆమె చేతి మీద తన చెయ్యి పెట్టి సేవ్ నొక్కబోయాడు స్వతంత్రంగా.

''ప్రమోద్! ప్లీజ్ డోంట్! ఆఫీస్‌లో ఇలాంటి చనువు చూపించొద్దు,'' సీరియస్‌గా అంది.

భుజాలెగరేసి, ''ఫైన్,'' అంటూ ప్రక్క సీటు తాలుకు ఖాళీ కంప్యూటర్ ఛెయిర్ లాక్కుని కూర్చున్నాడు.

''సారీ, కోపం వచ్చిందా?'' అనునయంగా అంది.

''లేదులే. అప్పుడప్పుడు నేను నీ మొగుణ్ణని మర్చిపోతావేమో అనిపిస్తుంది. ఫర్లేదుగాని, ఇంకా ఎంతసేపు?'' రోజంతా పనిచేసి అలసిన మొహంతో అడిగాడు.

''టూ మినిట్స్. ఓకే?''

''ఏమిటంత స్పెషల్ ఆ ఫోటోలో? ఇన్ని గంటల సేపు చేస్తున్నావ్?'' మళ్లీ అడిగాడు.

చర్చ ఇష్టం లేదన్నట్టు, ''ఎందుకోలే... వదిలెయ్,'' నవ్వుతూ అంటూ ఫిల్టర్స్‌లో లెన్స్ ఎఫెక్ట్ క్లిక్ చేసింది. కొత్త ఎఫెక్ట్‌తో బొమ్మ తయారవడం కోసం స్క్రీన్ పాతబొమ్మ మాయమయింది.

''వదలను. చెప్పాల్సిందే,'' చురుకైన కళ్లు ఆమె మొహం మీద నిలిపి, పట్టు వదలనట్టు అడిగాడు.

ఒక్క క్షణం ఏదో తెర వేసినట్టు ఆమె మొహం మ్లానమైంది.

''ఒకప్పుడు ఇంకో రాగిణి కోసం వెచ్చించాల్సిన సమయం ఈ రాగిణి కోసం ఖర్చు పెట్టి ఈ బొమ్మని శాశ్వతం చేయాలనుకున్నాను...'' ఆమె మాటలు పూర్తి కాకముందే కరెంటు పోయింది. గుయ్యిమంటూ ఏసీ ఆగిపోయింది. లైట్లు ఒకసారి డిమ్‌గా అయి ఇన్వర్టర్ సాయంతో మళ్లీ వెలిగాయి. యుపియస్ (అంతరాయం లేని విద్యుత్ సరఫరా) ఆసరా ఉన్న కంప్యూటర్ తన పని తాను చేసుకుపోతోంది.

''థాంక్ గాడ్! ఈ యుపియస్ లేకపోతే ఇన్ని గంటల నా శ్రమ ఏమయ్యేదో. ఎవరు కనిపెట్టారోగానీ దీన్ని,'' అంటుంటే స్క్రీన్ మీద రాగిణి బొమ్మ కనిపించింది. సోగగా ఉన్న అందమైన కళ్లతో అలౌకికమైన సౌందర్యం తళుక్కుమనేలా చిన్న నక్షత్రం లాంటి మెరుపు! రాగిణి ఫోటోనే, అనేక లేయర్స్‌గా ఎఫెక్ట్స్ అద్దబడి అద్భుతమైన పోర్ట్రెయిట్‌లా తయారైన ఈ ఆర్ట్ వర్క్‌కి మధ్య ఎంత తేడా ఉందో గమనించి అబ్బురపడుతూ, ''పారిజాతం! యు ఆర్ జీనియస్,'' అన్నాడు మెచ్చుకోలుగా, ఒకింత గర్వంగా.

తృప్తిగా ఆ బొమ్మని కళ్లారా చూసుకుని, సేవ్ చేసి, కంప్యూటర్ షట్‌డౌన్ చేసి, తన బాగ్ అందుకుంటూ, ''పోదామా?'' అంది.

"హమ్మయ్య," అని లేచాడు ప్రమోద్.

అతనితోపాటు నడుస్తూ, "ఈ పారిజాతం ఏమిటి ప్రమోద్? చంపుతున్నావు," చిరుకోపంగా, విసుగ్గా అడిగింది.

"ఈవేళ్టికి అదే నీ పేరు! దివిలో విరిసిన పారిజాతం," ఆమె తల మీద సరదాగా వేళ్లతో తాకబోయి, షాక్ కొట్టినట్టు నటిస్తూ, చెయ్యి వెనక్కి తీసుకుని, నవ్వుతూ ముందుకు నడిచాడు.

ప్రమోద్ కారులో కూర్చుని తలుపు తెరవగానే లోపల కూర్చుని తనకెంతో ఇష్టమైన ఈ ఉద్యోగం, కొద్ది సంవత్సరాల్లోనే తనకంటూ సంపాదించుకున్న గుర్తింపు, అపురూపంగా చూసుకునే భర్తా... కారు మెత్తగా ఇంటి వైపు సాగిపోతుంటే, వర్తమానంలోంచి గతంలోకి జారింది.

*

"తిన్నగా మీ అమ్మగారి దగ్గరకు వెళ్లండి. అంతా ఆవిడకు చెప్పండి," సూటిగా ప్రియంవదని చూస్తూ అన్నాడు మధుకర్.

లోపల మానసికంగా చిత్రవధ అనుభవిస్తున్నా పైకి నిశ్చలంగా కనబడటానికి ప్రయత్నిస్తోంది ప్రియ. జరిగినదంతా పూర్తిగా తెలిసిన మధుకర్ ముందు అలా కూర్చోవలసిన పరిస్థితికే అవమాన భారం దహించేస్తోంది. అతను ఏమనుకొంటున్నాడో తన గురించి! అతనికి కొద్ది దూరంలో చేతులు నులుపుకొంటూ, పెదవి కొరుక్కుంటూ నెర్వస్‌గా శ్రీకర్... తను ఇరుక్కున్న పరిస్థితి గురించిన గమనింపు కలిగినప్పటి నుంచి, దైహికమైన ఆకర్షణ, దాన్నే ప్రేమ అనుకోవడం, సంయమనం కోల్పోయి స్పర్శానందం కోసం తహతహలాడటం... ఇవన్నీ...పూర్వం థ్రిల్‌గా అనిపించినవన్నీ, ఇప్పుడు వెగటుగా, అసహ్యంగా అనిపిస్తున్నాయి! కానీ ఇప్పటికే ఆలస్యం అయిపోయింది. క్షణికమైన తొందరపాటు ఇలా 'పాయింట్ ఆఫ్ నో రిటర్న్'కి తెచ్చి వదిలేస్తుందని తెలియలేదు. ప్రియ గుండె లోతుల్లో దుఃఖం, ఆవేదన, భయం సుళ్లు తిరుగుతున్నాయి. మధుకర్ పక్కన కూర్చుని ప్రియతో చూపులు కలపడానికి భయపడుతున్న శ్రీకర్‌ని చూస్తూ, ఏదైనా పెద్ద కష్టం రాగానే జావకారిపోయి, బేలగా అన్నగారి భుజమ్మీద వాలిపోయే ఇతన్నా తను ప్రేమించాననుకుంది? అన్నీ సజావుగా నడుస్తుంటే, డబ్బున్న తండ్రి కొనిపెట్టిన హీరో హోండా మీద కాలేజీకి వస్తూ ధీరోదాత్తుడిలా కనిపిస్తూ, వాలంటైన్స్ డే రోజు రోజాపువ్వు అందించడం... చదువు పూర్తి కాకుండా, రూపాయి సంపాదించడం చేతకాకుండా ప్రేమకబుర్లు చెప్పడం... ఇవా తనవాడు కావాలనుకునే వ్యక్తిలో తను ఎదురుచూసే లక్షణాలు? ప్రేమ గుడ్డిది అని అందుకేనా అన్నారు? ఇది ప్రేమేనా అసలు?

"ప్రియంవదా! మీరింకేమీ ఆలోచించకండి. మీరలా నిశ్శబ్దంగా ఉంటే, అయాం వర్రీడ్. ఇలాటప్పుడు తప్పనిసరిగా మీ పేరెంట్స్‌కి తెలియజేయాలి. నేను మీకు పెద్ద పెద్ద లెక్చర్స్ ఇవ్వబోవడం లేదు. భయపడకండి. జరిగి పోయిందాన్ని మనం మార్చలేం. దాన్ని గురించి ఆలోచిస్తూ కూర్చోకండి. నా సలహా విని వెంటనే... మీ అమ్మగారికి అంతా చెప్పండి. ఆవిడ కాలేజి లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. పరిస్థితిని అర్థం చేసుకుని మిమ్మల్ని ఈ ఊబి నుంచి బైటికి లాగగల కెపాసిటీ ఆవిడకి ఉందని నా నమ్మకం. మీ నాన్నగారికి ఎలా చెప్పాలో ఆవిడకి తెలుస్తుంది. అంతగా వాళ్లిద్దరూ మీ పరిస్థితికి తగినట్టుగా స్పందించకపోతే సంశయించకుండా మళ్లీ నాతో మాట్లాడండి! నేను తప్పక సాయం చేస్తాను!" అనునయంగా అన్నాడు. ప్రియని చూస్తే అతనికి వింతగా వుంది. ఇంత జరిగినా మొండిగా, నిశ్చలంగా ఎలా ఉందో! శిలలా కనిపిస్తున్న ఆమె మనసులో ఏ మథనం జరుగుతుందో!

కొద్ది క్షణాల మౌనం తర్వాత ప్రియ కళ్లెత్తి శ్రీకర్ వైపు చూసింది. అతనూ నెర్వస్‌గా ఆమె వైపు చూశాడు. మనసులో ఉవ్వెత్తున్న లేస్తున్న భయాన్ని కమ్మేసే నిస్సహాయతని అదిమి పట్టుకుని, "నీ ఉద్దేశం ఏమిటి?" అంది ఆంగ్లంలో.

అతని చేతకాని కోపం చిరాకుగా పెల్లుబికింది. "నా ఉద్దేశ్యం అడుగుతావేమిటి? నాకేం ఉద్దేశ్యం ఉంటుంది? వెధవపని ఇద్దరం చేశాం. నింద నా మీద తోయడానికి ప్రయత్నం చెయ్యకు," తనూ ఆంగ్లంలోనే దురుసుగా అన్నాడు.

ప్రియ కళ్లు రెపరెపలాడాయి. ఆ క్షణంలో ఆమె మనసు లోతుల్లోంచి అతన్ని తీవ్రంగా అసహ్యించుకుంది. మధుకర్ అక్కడ లేకపోతే ఏమని ఉండేదో... తన భావాలన్నీ దాచుకుని, భావరహితమైన వదనంతో మధుకర్ వైపు చూసింది. అతని నిశితమైన చూపుల్లో తన పట్ల చులకనభావంగాని, ఏహ్యతగాని కనిపిస్తున్నాయేమో అన్నట్టు. ఒక సమస్యకి పరిష్కారం కోసం ప్రయత్నించే విజ్ఞుడిలా, మర్యాదపూర్వకంగా ఉన్నాడతను. శ్రీకర్ పోలికలు చాలానే ఉన్నా అతని కన్నా

స్థిరంగా, సమస్య వచ్చినపుడు నిలబడి పరిష్కారం వెతికేలా కనిపించాడు.

ఆత్మన్యూనతా భావం, అవమానభారం వెల్లువలా చుట్టేశాయి. "ఐ హేట్ మై సెల్ఫ్ ఫర్ దిస్... నన్ను చూస్తే మీకు అసహ్యం వేస్తుండచ్చు," అంది, మొదటిసారిగా తన భావాలు మొహంలో ప్రతిఫలించి చెంపల్ని ఎర్రబారుస్తుంటే.

"నో... నో... అలా అనుకోవద్దు. పొరపాట్లు ఎవరి వల్లయినా జరగవచ్చు. ఈ భయంకరానుభవం నుంచి మీరు చాలా గట్టి పాఠం నేర్చుకుని ఉంటారు. మీరు తల్చుకుంటే మీ చుట్టుపక్కల అందరికన్నా ఎంతో ఉన్నత స్థానానికి ఎదగగలరు... సమాజం మనని ఛీత్కరించే పరిస్థితే వస్తే ఆ స్థితిని మనమొక ఛాలెంజ్‌గా తీసుకోవాలి! అదే సమాజం మనని దిగ్భ్రమ చెంది చూసే స్థితికి ఎదగడానికి ప్రయత్నించాలి!" ఆమె కళ్లలోకి సూటిగా చూస్తూ, హిప్నటైజ్ చేస్తున్నట్టు అన్నాడతను. మళ్లీ నవ్వి, "పెద్ద లెక్చర్స్ ఇవ్వనంటూనే ఈ సోదంతా ఏమిటి అనుకుంటున్నారా? మీరెలా అనుకున్నా సరే, నేనొక్కటే చెప్పదలుచుకున్నాను. మీకొక సమస్య ఎదురైంది. దాన్ని ధైర్యంగా ఎదుర్కోండి!" అన్నాడు.

అతని అనునయపూర్వకమైన మాటలకి, ఆ కేసెట్ చూసి కూడా తనతో గౌరవపూర్వకంగా, పాజిటివ్‌గా మాట్లాడిన విధానానికి ప్రియకి ఉద్ధృతంగా దుఃఖం తన్నుకొచ్చింది. మోచేతి వంపులో మొహం దాచుకుని ఒక్కసారిగా భోరుమంది. శ్రీకర్ విసురుగా లేచి, కోపంగా, అసహనంగా రెండడుగులు అటూ ఇటూ వేశాడు. పిడికిలి బిగించి డైనింగ్ టేబుల్ మీద గట్టిగా చరిచి, 'హు!' అంటూ అవతలికి వెళ్లిపోయాడు. ఏడుస్తున్న ప్రియకి ములుకుతో గుచ్చినట్లయింది శ్రీకర్ ప్రవర్తన. మధుకర్ ప్రేక్షకుడిలా కూర్చుని ప్రియని కొంచెంసేపు ఏడవనిచ్చాడు. తర్వాత మంద్ర స్వరంతో,

"ప్రియంవదగారూ! ఇప్పుడేమీ మించిపోలేదు. మెల్లిగా మిమ్మల్ని మీరు సంభాళించుకుని మొహం కడుక్కుని రండి. కొంచెం కాఫీ తాగి, సర్దుకుని ఇంటికి వెళ్లండి. మీలాగే శ్రీకర్ కూడా టీనేజర్. ఇమ్మెచ్యూర్ ఫెలో. వాడి రియాక్షన్‌ని భూతద్దంలోంచి చూడకండి. మనమంతా మనకెదురయ్యే అనుభవాలనిబట్టి మెచ్యూర్ అవుతాం! మెల్లిగా వాస్తవాన్ని అంగీకరించండి. లేనివి ఊహించుకోకండి..." అన్నాడు.

మెల్లిగా కళ్లు తుడుచుకుని, "అయాం సారీ," అంటూ డైనింగ్ హాల్ పక్కనే ఉన్న బాత్రూంలోకి వెళ్లి, చల్లటినీళ్లతో మొహం కడుక్కుని వచ్చి మళ్లీ అదే కుర్చీలో కూర్చుంది. మధుకర్ వంటింట్లో కాఫీ చేస్తున్నట్టున్నాడు. హాలు నిశ్శబ్దం ఉంది. కందిరీగల్లా ఆలోచనలు ముసిరాయి. రాగిణి ఏం చేస్తోందో! అదీ తనలాంటి పరిస్థితిలోనే ఉంది. దాని బాయ్‌ఫ్రెండ్ దానికన్నా హీన స్థితిలో ఉన్నాడు. పదివేలిస్తే ఆ కేసెట్ ఇస్తానని ఆ దొంగ వెధవ కేశవ్ అన్నప్పుడు, అప్పుడే ఆ కేసెట్ చూసిన షాక్‌లో తన గొలుసు తీసి శ్రీకర్‌కి ఇచ్చేసి, ఎలాగోలా సెటిల్ చెయ్యమని చెప్పి, ఎవరో తరుముతున్నట్టు పారిపోయింది తను. శ్రీకర్ వాళ్ల అన్నకి ఏవో అబద్ధాలు చెప్పి అయిదువేలు తీసుకొచ్చి, గొలుసు అమ్మేసి, రెండూ కలిపి పదివేలూ కేశవ్ కిచ్చి, ఆ కాసెట్ తీసుకున్నాడు. ఆ విషయం ఫోన్‌లో చెప్పాక గానీ తనకి నిద్రపట్టలేదు. తర్వాత కూడా ఏదో భయం తన వెన్నంటే ఉంది. భయం భయంగానే నాలుగు రోజులు కాలేజికి వెళ్లింది. నిన్న పొద్దున్న కాలేజికి వెళ్తూనే శ్రీకర్ వచ్చి, వాడి దగ్గర ఆ కాసెట్ కాపీ చేసిన సిడి ఉందని, ఇంకో ఇరవై వేలు ఇస్తే అది కూడా ఇస్తానన్నాడనీ చెపితే నాగుపాము తన గొంతుకి చుట్టుకున్నట్టనిపించింది. ఇంక ఈ ఊబి నుంచి బయటపడటం అసాధ్యమనిపించి, భయంతో చెమటలు పట్టాయి. చచ్చిపోవాలనిపించింది! ఇంటి కెళ్లేసరికి డైనింగ్ టేబుల్ మీద కాఫీ తాగుతూ, పేపర్లు కరెక్ట్ చేస్తూ అమ్మ కనిపించింది. ఎప్పుడూ తన మొహాన్ని పుస్తకం చదివినట్టు చదివేసే అమ్మ, కరెక్షన్ హడావిడిలో ఉండడంతో నిన్నటికి తప్పించుకోగలిగింది.

రాత్రంతా భయంకరమైన కలలు. వారంరోజులుగా భయంగానే ఉన్నా పరిస్థితి సరిగ్గా అర్థమైంది నిన్ననే. నిన్నటివరకు ధైర్యంగా ఉన్న శ్రీకర్ ఒక్కసారిగా జావకారిపోయాడు. భవిష్యత్తంతా అంధకారంగా తోచింది. తనని కూతురిగా కన్నా స్నేహితురాలిగా భావించి, తన పట్ల కొండంత నమ్మకాన్ని పెంచుకున్న అమ్మ, గారాబంగా చూసుకునే నాన్న తన గురించి తెలిశాక ఏమనుకుంటారు? గుండె ఆగిపోయి చచ్చిపోతారేమో! చుట్టాలు, స్నేహితులూ తననెంత అసహ్యించుకుంటారో, వీలుదొరికినపుడు తనని ముట్టుకోవాలని ప్రయత్నించి భంగపడ్డ చిన్నత్త కొడుకు ఇక ముందు ఎలా ప్రవర్తిస్తాడో? మళ్లీ దుఃఖం ముంచుకొస్తుంటే గోడ గడియారం వైపు చూసింది. రెండు గంటలైంది. ఇంకాసేపట్లో శ్రీకర్ వాళ్లమ్మ వచ్చేస్తుంది. ఇంక తను వెళ్లిపోతే నయం.

సర్వం కోల్పోయిన దానిలా అతనివైపు చూసింది. వచ్చినప్పటి నుంచి ఆమెలో కనిపిస్తున్న మార్పులు గమనిస్తున్న మధుకర్‌కి ఆ చూపులో ఏం కనిపించిందో ఒక్క క్షణం అప్రమత్తుడయ్యాడు. ఆమె ప్రక్కనున్న కుర్చీలో, కొంచెం దూరంలో కూర్చుని, "ప్రియంవద గారూ! మీరు తెలివైన అమ్మాయి..." అంటూ ఏదో చెప్పబోయేంతలో,

"తెలివైన అమ్మాయి, కాని కారెక్టర్‌లెస్," అంది ఖిన్న వదనంతో.

కరుణగా నవ్వాడు మధుకర్. "కారెక్టర్ కేవలం భౌతికమైనది కాదు ప్రియంవదా! మీరింకా టీనేజ్ దాట లేదు! జరిగిన పొరపాటు తెలివిగా చక్కదిద్దుకోండి."

"ఇప్పుడింక ఆ అవకాశం ఏది?"

"మీరు కాఫీ తీసుకోండి, చెప్తాను!... దట్స్ గుడ్. ముందుగా జరిగినదంతా మీ అమ్మగారికి..." అతని మాటలు మధ్యలోనే కట్ చేస్తూ,

"అమ్మా నాన్నా నా గురించి తెలియగానే గుండె ఆగి చచ్చిపోతారు. లేదా పెరాలసిస్ వచ్చి చెయ్యో, మాటో పడిపోయి జీవితాంతం నన్ను శపిస్తూ బతుకు తారు," కన్నీళ్లు చెక్కిళ్ల మీంచి జారిపోతుంటే నిశ్చలం గా, మెల్లిగా అంది.

"ఈ విషయం గురించే లేనివి ఊహించుకోవద్దని అన్నాను ఇందాక. మీ అమ్మగారు పదిహేనేళ్లుగా లెక్చ రర్‌గా పని చేస్తున్నారు. కొన్ని వందలమంది టీనేజర్లకు పాఠాలు చెప్పి ఉంటారు. పరిస్థితిని సరిగా అర్థం చేసు కోగలరు. మీ నాన్నగారికి సర్ది చెప్పగలరు. ఇనీషియల్ షాక్, అపనమ్మకం, దుఃఖం మాత్రం తప్పవు. మీకు తెలుసు అదంతా. మీరు తిన్నగా ఇంటికి వెళ్లి, ఆవిడ ఇంటికి వచ్చాక, మెల్లిగా అంతా చెప్పండి. ఆవిడ అంతా వినగానే వైల్డ్‌గా, హిస్టీరిక్‌గా రియాక్టవచ్చు. మీరు అదంతా తట్టుకోవాలి," చివరి మాటలకి మళ్లీ ఆమె కళ్ల నుంచి జలజలా నీళ్లు రాలాయి.

"మనమేం చేసినా దాని ఫలితాన్ని భరించేందుకు సిద్ధపడాలి. పిరికివాళ్లలా పారిపోకూడదు," సైనికుడిలా పిడికిలి బిగిస్తూ అన్నాడు.

ఏడుస్తూనే నవ్వింది ప్రియ. కళ్లు తుడుచుకుని, గోరువెచ్చగా అయిన కాఫీ రెండు గుక్కల్లో తాగేసింది. బ్యాగ్ నించి చిన్న కాంపాక్ట్ తీసి, రుమాలుతో మొహం ఒకటికి రెండుసార్లు తుడుచుకుని కొద్దిగా పౌడర్ రాసు కుంది. అతనివైపు చూసి, దిగులుగా, 'థాంక్యూ,' అని లేచింది.

"ఇంటి దగ్గర డ్రాప్ చేయనా?" అడిగాడు మధుకర్ తనూ లేచి నిలుచుంటూ.

"వద్దు," అంటూ గబగబా వీధి తలుపు దాకా వెళ్లిపోయింది.

ఒక క్షణం ఆలోచించి, తనూ ఆమె వెంట వెళ్లి, "ఆగండి. నేను దింపుతాను," అంటూ, పోర్టికోలో వున్న కారు తీశాడు.

ఒకవైపు అతని శ్రద్ధకి కళ్లు చెమరుస్తున్నా, మరో వైపు ఇతని మనసులో ఇంకేదైనా ఉద్దేశ్యం ఉందా అన్న అనుమానం పీడిస్తుంటే, మౌనంగా వెనక సీట్లో కూర్చుంది. అతను ఏమీ అనలేదు. కొంచెం పాతగా కనిపిస్తున్న మారుతీ కారు శబ్దం చేస్తూ మెయిన్ రోడ్డు మీదికి వచ్చింది. ప్రయాణం మౌనంగా సాగింది. ఇల్లు చేరే ముందు, "టఫ్ టైమ్స్ నెవర్ లాస్ట్, టఫ్ పీపుల్ డు, అన్న మాట విన్నారా? అదే పేరుతో ఒక పుస్తకం కూడా వచ్చింది. ఇపుడు మీకో లక్ష్యాన్ని నిర్దేశించుకోండి. అమ్మానాన్నలతో సహా ఎవరేమన్నా మొండిగా భరిం చండి. మీ లక్ష్యాన్ని చేరిన రోజు ఇదంతా ఒక చేదు జ్ఞాపకంగా మిగులుతుంది. మీ ముందు ఎంతో మంచి భవిష్యత్తు ఉంది. నా మాట బాగా గుర్తు పెట్టుకోండి. ఇంట్లో ఒకవేళ మీకు అనుకూలంగా జరగకపోయినా నేను మీరీ 'మెస్' నుంచి బయటపడటానికి సాయం చేస్తాను... ఎలాగో ఒకలాగ. ఇలా ఇంకెప్పుడూ జరగ కుండా మీరు చూసుకుంటారని నాకు తెలుసు. ఆల్ ద బెస్ట్," అంటూ రోడ్డు పక్కగా కారు ఆపాడు.

దిగి, మరోసారి పేలవంగా నవ్వుతూ, "థాంక్యూ," అంది ప్రియ. అతను వెళ్లిపోయాడు.

దుమ్ము రేపుతూ ముందుకి సాగిన ఎర్రటి ఆ పాత మారుతీ కారుని చూస్తుంటే, 'శ్రీకర్ బ్రదర్ మేధావిలా ఫోజులు కొడుతుంటాడ'ని అతని గురించి తను రాగిణితో చెప్పి నవ్వుకోవడం గుర్తొచ్చింది. మెల్లిగా తాళం తీసి ఇంట్లోకి నడిచింది. తలుపు తీస్తుంటే ఫోను శబ్దం వినిపించింది. భయంగా, సంకోచంగా కొంచెం సేపు ఆగి, రిసీవర్ తీసింది. కొద్ది క్షణాల మౌనం. 'కేశవ్ కాదు కదా,' దడ దడ కొట్టుకుంటున్న గుండెతో ఊపిరి బిగపట్టింది. పెట్టేద్దామా అనుకుంటుంటే, అవతలి గొంతు దుఃఖభారంతో, "ప్రియా!" అంది జీరగా. రాగిణి!

"రాగా!" అంది ప్రియ.

"ప్రియా! పొద్దుటి నుంచి చాలాసార్లు చేశాను. నువ్వు కాలేజీకి రాలేదు. సోమూ వాళ్లమ్మకి బాగోలేదని చెప్పి వాళ్ల ఊరు పారిపోయాడు. నాకేం చెయ్యాలో

తెలీడం లేదు...'' వెక్కిళ్లు పెడుతూ, ''పదివేలు వెంటనే ఇవ్వకపోతే ఆ కేశవ్‌గాడు వీడియో కాసెట్ కాపీలు తీసి మన కాలేజి స్టూడెంట్స్‌కే అమ్ముతాట్ట... పదివేలు కాదు, నా దగ్గర వంద రూపాయలు కూడా లేవే,'' ఏడుస్తూ అస్పష్టంగా చెప్పింది రాగిణి.

''రాగా! అలా ఏడవకే! పదివేలిచ్చినా మాకూ ఈ పీడ వదల్లేదు కదే. ఇది డబ్బుతో వదిలేది కాదే. మనం నిండా మునిగిపోయాం. ఇంక అమ్మకి అంతా చెప్పే య్యాలని డిసైడ్ చేసుకున్నాను. తర్వాత ఏదైతే అది కానీ...'' మళ్లీ ఊరుతున్న కన్నీటిని తుడుచుకుంటూ అంది ప్రియ.

''నేను అలా చెప్పలేనే... ఇలా బతికే బదులు చావాలని ఉంది.''

''రాగా! నాకూ అలాగే ఉంది. కానీ చచ్చినా ఈ మచ్చ పోదు. మనం చచ్చాక ఏమవుతుందో, నలుగురూ ఏమనుకుంటారో ఊహిస్తే చావాలని లేదు. ఇంక ఏ దారి లేదంటే ఏం చేస్తానో...'' కళ్లనీళ్లు రిసీవర్ మీద పడుతుంటే వీధి తలుపు వైపు చూస్తూ అంది.

హఠాత్తుగా ఫోను పెట్టేసింది రాగిణి. ఎవరన్నా వచ్చారేమో అనుకుంది ప్రియ. కాళ్లీడుస్తూ తన గదిలోకి వెళ్లింది. తల్లి సెల్‌కి ఫోన్ చేసింది.

''చెప్పరా బంగారూ,'' సుమతి గొంతు.

మళ్లీ ఏడుపొచ్చింది ప్రియకి. 'బంగారూ! తనా బంగారు?'

''ప్రియా! ఏమిటమ్మా?'' అడుగుతోంది తల్లి.

''ఏం లేదు. త్వరగా ఇంటికి... వస్తావా?''

''ఒంట్లో బాలేదా?... ఇంకొక్క క్లాసుంది. చెప్పేసి రానా? పర్మిషన్ తీసుకుని వచ్చెయ్యనా?''

''వద్దు. చెప్పేసి రా,'' అని ఫోను పెట్టేసింది.

ఇంట్లో ఎవరూ లేకపోవడంతో మనసు తేలికపడే దాకా మంచం మీద బోర్లా పడుకుని, ఏడుస్తూ ఉండి పోయింది.

*

ప్రాక్టికల్ క్లాసులు జరుగుతూండడంతో మేడ మీది ఫిజిక్స్ స్టాఫ్ రూం దాదాపు ఖాళీగా ఉంది. సుమతి ఒకర్తీ కూర్చుని అరగంట తర్వాత చెప్పబోయే క్లాసుకు ఏవో పుస్తకాలు రిఫర్ చేస్తోంది. గుమ్మం దగ్గర అలికిడికి తలతిప్పి చూసింది. సన్నగా పొడుగ్గా ఉన్న పాతికేళ్ల వ్యక్తి, ''సుమతీ మేడం మీరేనా?'' అని అడిగాడు సందేహంగా.

''ఎస్!'' ప్రశ్నార్థకంగా చూసింది.

అతను లోపలికి వచ్చి, ''మేడం! నేను మీ స్టూడెంటుకి అన్ననవుతాను. మీతో కొద్దిసేపు మాట్లాడా లని వచ్చాను,'' అన్నాడు.

''ఓ... రండి. కూర్చోండి,'' అంటూ పక్కనున్న కుర్చీ చూపించింది.

''పేరు?''

''పేరు తర్వాత చెప్తాను మేడం! మీ సలహా కోసం వచ్చాను.''

''ఏమిటి ప్రాబ్లెం?'' చిరునవ్వు మొహంతో అడిగింది.

''మా ఇంట్లో చాలా గారంగా పెంచారు మా చెల్లెల్ని,'' టేబుల్ మీదున్న పేపర్ వెయిట్ తిప్పుతూ అన్నాడు.

అతని పోలికలున్న తన స్టూడెంట్ ఎవరా అని ఆలోచిస్తూ, ఆ మాటలు విని, తలూపింది, 'అర్థ మైంది,' అన్నట్లు.

''కాలేజీలో ఏవో ప్రాజెక్ట్ చేయాల్సి వచ్చి వీళ్ల టీం నలుగురూ ఇంటర్నెట్ సెంటర్‌కి వెళ్తూ వచ్చారట.''

భృకుటి ముడేస్తూ, ''ఫిజిక్స్‌లో అలాంటివేం లేవే?'' అంది సుమతి.

''ఫిజిక్స్ కాదు మేడం! కంప్యూటర్స్.''

''ఓ... కంప్యూటర్స్ నెక్స్ట్ బ్లాక్లో...'' ఆవిడ మాట పూర్తికాకుండానే,

''మేడం! మా చెల్లెలికి మీమీద చాలా గురి, ఆరాధనాభావం. అందుకే మీ దగ్గరకొచ్చాను,'' సుమతి మొహంలోకి చూస్తూ తన మాటలు శ్రద్ధగా వినమని అభ్యర్థిస్తున్నట్టు అన్నాడు.

ఆశ్చర్యపోతూ, ''చెప్పండి... ప్రశాంతి గురించా?'' అంది.

ఒక్క క్షణం మౌనంగా ఆగి, ''పేరు ఇప్పుడే చెప్పక తప్పదా మేడమ్!'' ఇబ్బందిగా అడిగాడు.

సుమతికి ముచ్చటగా అనిపించింది. 'చెల్లెలి మీద ఎంత ఆపేక్షో,' అనుకుంటూ, ''ఎవరో తెలియ కుండా నేనేం సాయం చేయగలను,'' అంది వింత పడుతూ.

''ఆ వయసు పిల్లల గురించి మీకు వివరించి చెప్పక్కర్లేదు కదా మేడమ్!'' ఇబ్బందిగా ఇంగ్లీష్‌లో అని, ''భౌతికమైన సాన్నిహిత్యానికి, ప్రేమకీ తేడా తెలుసు కోలేరు,'' అన్నాడు.

సుమతికి నవ్వు వచ్చింది. 'ఇతను మహా ఆరిందా అయినట్టు,' అనుకుని అవును అన్నట్టు తలూపింది.

“ఆ టీమ్‌లో ఒక కుర్రాడిని ప్రేమిస్తున్నానను కుని, వాడితో చనువుగా ఉండడం మొదలు పెట్టిం దిట.”

తనకు తెలిసిన ఇద్దరు ముగ్గురు అమ్మాయిల గురించి ఆలోచిస్తూ వాళ్లలో, ‘ఎవరా,’ అనుకుంటూ వింటోంది.

“ఆ ఇంటర్నెట్ సెంటర్లో ప్రాజెక్ట్ వర్క్ కాదుగాని ఇరోటిక్ సైట్స్ ఏం చూసేవారో ఏమోగాని దె స్టార్టెడ్ నెకింగ్ ఈచదర్,” కిటికీ బయటికి చూస్తూ ఇబ్బందిగా అన్నాడు.

“అయ్యో!” అంది సుమతి.

“... ...” మౌనంగా ఉండిపోయాడతను.

“కనీసం ఇప్పుడైనా మీరు మీ పేరెంట్స్‌కి చెప్పాలి. ఇద్దర్నీ కూర్చోబెట్టి కౌన్సిలింగ్ చెయ్యాలి. ఇలాంటి విషయాల్లో ఆలస్యం పనికిరాదు. ఒకసారి దారి తప్పితే దాని ఫలితం జీవితాంతం అనుభవించాల్సి ఉంటుంది. వాళ్లే కాదు... మీరు కూడా. కుటుంబం అంతా!”

“ఇప్పటికే కొంత ఆలస్యం అయింది మేడమ్. ఆ ఇంటర్నెట్ సెంటర్ వాడు ఒట్టి లుచ్ఛాగాడు. వాడు వీళ్లకి తెలియకుండా వీడియో తీశాడు.”

“ఆ! అయ్యో! మరి?” ఇతరుల కష్టాలకి సాధా రణంగా అందరూ స్పందించే తీరులోనే, క్లాసు టైమవు తూండటంతో తన కాగితాలు ఫైల్లోకి అమర్చుకుంటూ ఒకింత సానుభూతిగా అంది సుమతి.

ఆమె స్పందన గమనిస్తూ, “కిందటి వారం వీళ్లు అక్కడికి వెళ్లగానే ఆ కాసెట్ ప్లే చేసి చూపించి, వీళ్లని బ్లాక్‌మెయిల్ చెయ్యటం మొదలెట్టాట్ట,” బాధగా అన్నాడు.

“ఏమని?”

“పదివేలు ఇస్తే సరే, లేకపోతే ఆ కాసెట్ వీళ్ల కాలేజి స్టూడెంట్స్‌కి, న్యూస్‌పేపర్స్‌కి అమ్ముతానని బెది రించాట్ట డర్టీఫెలో!”

‘తనూ చిన్నవాడే అయినా చెల్లెలి పట్ల అతని కున్న శ్రద్ధకి సంతోషం అనిపించినా, తప్పు ఆ అమ్మాయి లో పెట్టుకుని వాణ్ణి డర్టీఫెలో అనడం ఎందుకు? నీతి నియమాల్లేకుండా వెధవ ఇంటర్నెట్ సెంటర్లో, క్లాస్ మేట్‌తో వెర్రి వేషాయలేయడం ఏమిటి? పబ్లిక్ ప్లేస్ అనే జ్ఞానం లేదూ? అయినా చెల్లెలు అలాంటి పని చేస్తే ఇంత సానుభూతితో స్పందించే అన్న ఉంటాడా?’ వింతగా అతన్ని చూసింది.

“ఇద్దరూ షాక్ తిన్నారు... ఇంట్లో వాళ్లకి తెలియ కుండా ఆ డబ్బు తెచ్చిచ్చి, ఆ కాసెట్ తీసుకున్నార్ట.”

దీర్ఘంగా ఊపిరి పీల్చి, ‘కాస్త కనిపెట్టి చూడమని, అవసరమైతే మందలించమని అడగడానికి వచ్చినట్టు న్నాడు,’ అనుకుంటూ, “ఇంక మీరు మీ చెల్లెల్ని కని పెట్టుకుని చూడాలి. మొత్తానికి గట్టి పాఠమే నేర్చు కున్నారన్నమాట! ఇప్పటికైనా మీరు మీ పేరెంట్స్‌కి చెప్పాలి... మరి నా క్లాస్‌కి టైమవుతోంది,” ‘నే వెళ్లాలి,’ అని సూచిస్తూ అంది సుమతి.

“అంతటితో అవలేదు మేడమ్! ఆల్ ఈజ్ వెల్ దట్ ఎండ్స్ వెల్ అంటారు. అలా అయి ఉంటే నేనిలా వచ్చేవాణ్ణి కాదు.”

“మరి?”

“నాలుగు రోజులాగి, ఇంకో సిడి చూపించి, ‘కథంతా ఇందులో ఉంది. ఇంకో ఇరవై వేలు పట్టుకు రమ్మ’ని మళ్లీ మొదలుపెట్టాట్ట!”

“అయ్యో! ఇదేదో ఊబిలా ఉంది. ఇలాంటిది పిల్లలు టాకిల్ చెయ్యగలిగింది కాదు. మీ తల్లిదండ్రు లకి చెప్పి తీరాలి.”

“వాళ్లకి చెపితే దాన్ని చంపేస్తారు మేడమ్! మా నాన్నగారు పరువుకి ప్రాణం ఇస్తారు.”

‘వెధవ పెంపకాలు పెంచడం... వాళ్లు దారి తప్పాక ఇలా రాక్షసంగా స్పందించడం,’ చులకనగా వాళ్లని తలుచుకుంటూ, పైకి, “ఆ పిల్లని చంపితే పరువు నిలుస్తుందా బాబూ?” అంది సానుభూతిగా.

“చంపుతారంటే నిజంగా చంపుతారని కాదు మేడమ్. తనని కొట్టి, తిట్టి హింసిస్తారు.”

“తను ప్రవర్తించిన తీరుకీ, వాళ్ల మనసుల్ని గాయపరచినందుకూ మీ చెల్లెలు అదంతా భరించా ల్సిందే,” కఠినంగా అంది సుమతి.

ఆమెనే సూటిగా చూస్తూ, “మన జీవితాలు న్యాయసూత్రాల ననుసరించి సాగవుగా మేడమ్! ఇప్పటికే సిగ్గుతో, భయంతో కుంచించుకుపోయి ఆమె ఏ ఆత్మహత్య గురించో ఆలోచిస్తూ ఉండొచ్చు. వాళ్ల రియాక్షన్‌తో తనకు అండ ఎవరూ లేరని, ఈ అవమా నంతో, తోటివాళ్ల హేళనతో బతకడం ఎందుకని అను కుంటే జీవితాన్ని అంతం చేసుకోవడం చిటికెలో పని...” ఆవేదనగా అన్నాడు.

ఇంతలో ఠంగ్‌మని బెల్ మోగింది.

సుమతి నిలుచుని, “నేను వెళ్లాలి బాబూ! నా క్లాసు టైమయింది. మీ చెల్లెలి గురించి వింటే బాధగానే

ఉంది. ఇదంతా నాకెందుకు చెప్పావోగాని, నీలాంటి అన్న ఉన్న అమ్మాయి తనకెవరూ అండలేరని అనుకునే పరిస్థితి రాదనుకుంటాను! ఇంక మరి నే వెళ్తాను,'' అంటూ నడవబోయింది.

''ఒక్క నిమిషం మేడమ్!''

ఈసారి కొంచెం చిరాగ్గా అతన్ని చూస్తూ, ''క్లాసుకి లేటుగా వెళ్లటం నాకిష్టం ఉండదు. అయినా ఇవన్నీ నా కన్నా ఎక్కువ ఇన్వాల్ అయి, సాయం చెయ్యగల అవకాశం ఉన్న వాళ్లతో చర్చిస్తే బావుంటుంది,'' అంది నిక్కచ్చిగా.

''అయాం సారీ మేడమ్! ఈ విషయంలో మీకన్నా ఎక్కువ ఇన్వాల్‌మెంట్ ఉండగల వాళ్లెవరూ లేరు. నేను చెప్పిన ఆ చెల్లెలు ఎవరో కాదు, మీ అమ్మాయి ప్రియ,'' అన్నాడు తనూ లేచి నిల్చుంటూ.

నిశ్చేష్టురాలై కళ్లప్పగించింది సుమతి. ''మా అమ్మాయా? నీకేం పిచ్చా? మా అమ్మాయి ఈ కాలేజీ కాదు,'' అంది వస్తున్న కోపాన్ని ఆపుకుంటూ.

''నాకు తెలుసు మేడమ్! నేను చెప్పినదంతా మీ అమ్మాయి ప్రియ గురించే,'' మెల్లిగా స్పష్టంగా అన్నాడు మధుకర్.

ఆ మాట మెదడుకి అర్థం కావడానికి కొంత సమయం పట్టింది. తన గారాలపట్టి, బంగారు బొమ్మ ప్రియా? మంచి ప్రవర్తనకి మారుపేరన్నట్టుండే ప్రియా? ఇప్పటికీ అదాటుగా వచ్చి తనని కావలించుకుని, ''అమ్మా! ఐ లవ్యూ,'' అని తేలికగా ముద్దులు కురిపించే ప్రియా?

నమ్మలేనట్టుగా అతన్ని చూస్తూ, ''ఇదేమైనా నాటకమా?'' అంది కఠినంగా.

ఆమె మొహంలో మారిపోతున్న రంగులూ, వంకర తిరుగుతున్న పెదవి, అదురుతున్న ముక్కు పుటాలు గమనిస్తూ, ''ఇది నాటకం అయితే బానే ఉండేది. వాస్తవం కనుకే బాధ మేడమ్!'' అన్నాడు విచారంగా.

''ఆ అబ్బాయివి నువ్వా?'' ఏహ్యంగా అంది.

''ఉహు... కాదు, నా తమ్ముడు.''

ఆ ఒక్కక్షణంలో ఎన్నో సందేహాలు కలిగాయి సుమతికి. వీళ్లంతా ఏదో రాకెట్ నడుపుతున్నారా ఏమిటి? నా బంగారు పాపని ఇందులో ఎలాగో ఇరికించారా? ఎన్నో భయాలు, సందేహాలు కళ్లలో ప్రతిఫలిస్తుంటే వాక్కుగా చూస్తుండిపోయింది.

''అయామ్ వెరీ... వెరీ సారీ.''

''నువ్వెందుకు సారీ?'' కొట్టినట్టు ఉగ్రంగా అంది.

''నా ద్వారా ఇదంతా వినడం మీకు చాలా బాధ కలిగిస్తుందని తెలుసు నాకు.''

''అదే... అదే నిజమైతే... ఏ... నువ్వెందుకు చెప్పడానికొచ్చావు?'' కోపంలో మాట తడబడిపోతుంటే అంది.

అతను మౌనంగా ఆగాడు, సుమతి తన్ను తాను సంబాళించుకుంటుందనే ఉద్దేశ్యంతో.

'ఇలాంటిదేదో ఉచ్చులా బిగించి తన కూతుర్ని సొంతం చేసుకోవాలనా? పెళ్లి చేసుకోవాలనా? అసలు వీళ్లదే కులం?' కడుపులో దుఃఖం, బెంగ ఉండ కడుతున్నాయి.

''నువ్వే ఉద్దేశ్యంతో వచ్చావిక్కడికి? అభంశుభం తెలీని పిల్లకి పిచ్చివేషాలు నేర్పించి... దాన్ని ఏం... చెయ్యాలని ఇలా చేశావు?'' కోపంతో వణుకుతూ అంది.

''మేడమ్! ప్లీజ్ కంట్రోల్ యువర్ సెల్ఫ్. మీ అమ్మాయి ఎంత అమాయకురాలో, మా తమ్ముడూ అంతే. ఇద్దరూ టీనేజర్స్...''

అతన్ని మధ్యలో ఆపి, తర్జని చూపుతూ, ''షటప్! రౌడీవెధవలాగా ఆడపిల్లల వెంటబడి వాళ్లని వలేసి లాగే నీ తమ్ముడూ, వాణ్ణి వెనకేసుకొచ్చే నువ్వూ, పెద్ద మునీశ్వరుడిలా నీతులూ...'' కందగడ్డ లాంటి మొహం, వేలు తగిలితే రక్తం చిమ్మేలా అనిపించింది మధుకర్‌కి. ఆవిడ రియాక్షన్ ఊహించిందే అయినా అతనికి ఒళ్లు మండింది.

''మేడమ్!'' దవడ బిగించి తన ఉద్రిక్తత నిగ్రహించుకుంటూ, ''ఇలాంటి మాటలు నేనూ అనగలను. మీ అమ్మాయే మా తమ్ముడి వెంటబడి వలేసి, పెళ్లాడాలని ప్రయత్నించిందనో, అంతకన్నా నీచంగా మగాడితో ఏకాంతం కోసం ఎగబడిందనో అంటే ఏం చెయ్యగలరు మీరు?'' నిదానంగా స్పష్టంగా అన్నాడు మధుకర్.

గాలి తీసిన బెలూన్‌లా అయిపోయి, వెర్రిగా కళ్లప్పగించి చూస్తుండిపోయింది సుమతి.

''మీ ఆవేశంలో అసలు సమస్యని మర్చిపోతున్నారు. వీళ్లిద్దరి ఎడోలసెంట్, షేమ్‌లెస్ ప్రవర్తన ఒక సమస్య అయితే ప్రస్తుతం వీళ్లు ఇరుక్కున్న ఊబి నుంచి విముక్తి ఎలాగ అనేది అంతకన్నా పెద్ద సమస్య.

చటుక్కున కూలబడి రెండు చేతుల్లో తల పెట్టుకుంది సుమతి.

"నిన్న సాయంకాలం మా అమ్మానాన్నగారు ఏదో పెళ్లికి వెళ్లారు. నా తమ్ముడు తలనొప్పిగా ఉందని భోజనానికి రాకుండా పడుకుంటే, ఏదో కొంచెం తినేసి పడుకోమని లేపటానికి వెళ్లాను. ఏడ్చినట్టున్న వాడి మొహం చూసి గుచ్చి గుచ్చి ఏ సమస్య అయినా నేను సాయం చేస్తానని మాట ఇస్తే అంతా చెప్పకొచ్చాడు. మా వీడియో కెమెరాలో ఆ మినీ కాసెట్ పెట్టి చూశాను. బోత్ వర్ కిస్సింగ్ అండ్ హగ్గింగ్... అంతే," ఇబ్బందిగా ఆగి, "అదే ఇరవై నిమిషాల పాటు... నాకూ మీలాగే పిచ్చి కోపం వచ్చింది.

"కొన్ని నిజాలు వినడానికి చాలా బాధాకరంగా ఉంటాయి మేడమ్! శ్రీకర్ మాటల్లో దుఃఖం, అవ మానం గురించి బెంగ, అమ్మానాన్నలకీ, కాలేజీలో ఫ్రెండ్స్‌కీ, లెక్చరర్స్‌కీ తెలిస్తే ఎలా అనే భయం... వీటన్నిటి మధ్య వాడితో పాటు దీనిలో ఇరుక్కున్న ప్రియ గురించి కూడా ప్రస్తావన వచ్చింది. ఈమధ్య ఏ వార్తాపత్రిక చూసినా చిన్నచిన్న పొరపాట్లతో జీవితం నరకం చేసుకుని ఆత్మహత్యల దాకాపోయే ఎడోల సెంట్స్ గురించిన వార్తలు తరచుగా కనిపిస్తున్నాయి. రాత్రి పడుకుని శ్రీకర్ సమస్యకి పరిష్కారం ఆలోచిస్తూ ఉంటే ఆడపిల్ల ప్రియ గురించి కూడా ఐ ఫెల్ట్ వర్రీడ్. నిన్న వీడు కాలేజికి వెళ్లలేదు. ప్రియ కూడా వెళ్లి ఉండదు..."

నిన్న పేపర్స్ కరెక్ట్ చేస్తూ, రెండుసార్లు, 'ప్రియా బేబీ! ఓ కప్పు కాఫీ ఇవ్వరా,' అని తను ముద్దుగా పిలవడం, ప్రియ నుంచి జవాబు రాక ఏదో చదువుకుం టుందేమో అని పట్టించుకోక పోవడం గుర్తొచ్చాయి... రాత్రి భోజనానికి పిలిచినపుడు, 'ఆకల్లేదమ్మా, ఫ్రెండ్ పుట్టినరోజుకు పీజా తినిపించింద'ని గదిలోంచి ప్రియ అరవడం, భర్త క్యాంప్ కెళ్లి ఉండడం, తను కూడా అలిసిపోయి ఉండటంతో ఉన్నదేదో తినేసి పడుకో వటం జరిగింది. పొద్దున్న వంట చేస్తూ వంటింట్లోనే అపుడో కాస్తా, అపుడో కాస్తా సిప్ చేస్తూ కాఫీ తాగేసింది. న్యూస్‌పేపర్ వెనుక ప్రియ మొహం ఎలా ఉందో గమ నించలేదు. ప్రియ బాత్‌రూమ్‌లో ఉండగానే తను టిఫిన్ తినేసి కాలేజీకి వెళ్లిపోయింది. తమ ఉదయాలు అపుడపుడు ఇలాగే ఉంటాయి. కానీ సాధారణంగా సాయంత్రం కొంతసేపైనా ఇద్దరూ కలిసి గడుపుతారు. ఎక్కువ క్యాంప్స్ ఉండే ఉద్యోగంలో ఉన్న భర్త ఊళ్లో ఉంటే చిన్నచిన్న షికార్లు, సినిమాలు మామూలే. తమ పెంపకంలో ఏం తప్పు జరిగింది?

రూమ్ బయట ఇద్దరు కుర్రాళ్లు కనిపించగానే తన క్లాసు మాట గుర్తొచ్చింది! క్లాసు తీసుకోవడం లేదని చెప్పి వాళ్లని పంపించేసింది. మధుకర్ వైపు చూసింది! ఏదో చెపుతున్నాడితను... ఏమిటది అన్నట్టు.

"అమ్మ స్కూల్‌కి వెళ్లిపోయాక నేను ఆఫీసుకి సెలవుపెట్టి శ్రీకర్‌తో ఉండిపోయాను. వాణ్ణి చూస్తే వర్రీడ్‌గా అనిపించింది. ఏం చెయ్యాలో వాడితో ఆలో చిస్తుంటే ప్రియ వచ్చింది..."

"ఆఁ మీ ఇంటికా?! అలా అపుడపుడు వచ్చేదా?" కొరడాదెబ్బ తగిలినట్టు అడిగింది.

"లేదు మేడమ్! నేను తనని చూడటం చాలా తక్కువ. శ్రీకర్ నాతో చనువుగానే ఉంటాడు. చాలా విషయాలు చెపుతాడు. ప్రియ గురించి ఎపుడూ ఇలా చెప్పలేదు. తన రాకకి వాడు కూడా ఆశ్చర్యపోయాడు."

సుమతి మొహం అవమానంతో కందింది.

"ప్రియ చాలా వర్రీ అయి ఉండాలి. ఎవరితో మనసు విప్పి చెప్పుకుంటుంది ఇలాంటి సమస్య గురించి? బహుశ ఇద్దరూ కలిసి ఏం చెయ్యాలో ఆలో చించాలని వచ్చిందేమో."

"చాలాసేపు ఇద్దరితో మాట్లాడాను. ఈ విషయం మీతో చెప్పమనీ, మీ సాయం తీసుకోమనీ ప్రియని కన్విన్స్ చేశాను..."

అల్లారుముద్దుగా, కలల పంటలా పెంచు కుంటున్న తన కూతురికి సమస్య వచ్చినపుడు తల్లితో చెప్పుకోవాలని నిన్నటిదాకా ఎవడో తెలియని వ్యక్తి కన్విన్స్ చేయాల్సి వచ్చింది! ఇలాంటి పిల్లల్ని ఎందుకు కనడం? అష్టకష్టాలు పడి పెంచడం!? మనసులో విరక్తిగా అనిపిస్తుంటే,

"నా సాయమా? నేనేం చెయ్యగలను? " అంది.

"అలా అనకండి. మీరొకరే మీవారికి అనునయం గా పరిస్థితిని వివరించగలరు. నేను కూడా మా పేరెంట్స్‌కి చెప్పలేదు. ఇంటికి వెళ్లాక చెప్పాలి. నా ఫ్రెండొకడు ఏసిపి ఉన్నాడు. వాడి సాయం తీసుకోవా లనుకుంటున్నాను. నాన్నగారితో మాట్లాడతాను. మీవారికీ తెలిసిన వాళ్లుండవచ్చు."

సుమతి ఇంకా 'జరిగిన కథ'లోనే ఉంది.

జరగాల్సిన పని, తన కర్తవ్యం గుర్తుకు రావడం లేదు. ఇంకా తన కూతురు ఇలాంటి పని చేసిందని నమ్మలేనట్టుగా ఉంది. అదే నిజమైతే ఎప్పుడూ చెయ్యి చేసుకోకుండా పుత్తడిబొమ్మలా పెంచుకున్న కూతుర్ని, తన చేతులు కందిపోయేలా, ఆమె చెంపలు వాచి పోయేలా కొట్టాలని ఉద్రేకం...

"మేడమ్! ఇంటికి వెళ్లగానే మీ అమ్మాయి చెప్పే దంతా వినండి. మీకు మీ ఆక్రోశం అంతా వెళ్లగక్కి, ఆమెని అసహ్యించుకుని, చీదరించుకుని, తిట్టి, కొట్టి, ఏడ్చి గగ్గోలు పెట్టాలని ఉండొచ్చు. అంతా అయి మీ ఆవేశం తీరాక, రేప్పొద్దున మీరు చెయ్యాల్సిన పనులు గుర్తొస్తాయి. ఇట్ మే బి టూ లేట్! అన్ని దారులూ మూసుకుపోయాయనుకున్న ఆడపిల్ల ఆత్మహత్య చేసు కుంటుంది. లేదా ఇల్లొదిలి వెళ్లిపోతుంది. ఇవాళ్టి పరి స్థితుల్లో రెండూ ఒకటే. మీరు ఒకరోజు ఆలస్యంగా మేలుకుని లాభం లేదు. మిమ్మల్ని మీరు అపుడెంత నిందించుకున్నా ఉపయోగం ఉండదు..."

"అంటే... 'అమ్మా! వెధవపని చేశాను. నన్ను కాపాడు,' అని ఎవరితోనో కబురు పంపిస్తే, 'మా అమ్మవు కదూ! ఏడవకు. అంతా నేను చూసుకుం టాను,' అనాలా" కసిగా, ఉక్రోషంగా అంది సుమతి.

"మేడమ్! మీరు తప్పు అనడం లేదు. ప్రియ చేసి నది కరెక్టనీ అనడం లేదు. కానీ విషయం తెలియగానే మీ ప్రవర్తనకీ, ఆవేశం తగ్గాక మీ ప్రవర్తనకీ చాలా తేడా ఉంటుంది. ఇపుడు మీరనుకున్నంతగా కొంపేం మునగలేదు."

"నీకేం నాయనా!? నాలుగు రోజుల్లో నీ తమ్ముడి ప్రవర్తన అంతా మర్చిపోతారు. అల్లరి పడిన ఆడపిల్లను సమాజం చచ్చేదాకా పీక్కుతింటుంది," అంటుంటే కళ్ల వెంట జలజలా నీళ్లు రాలాయి. "అంతకన్నా అది ఛస్తే నయం."

మధుకర్, 'మీ మెచ్యూరిటీ ఇంతేనా,' అన్నట్టు కరుణగా నవ్వాడు. "మీరు రేపుదయం ఇలా అనుకోరు. రేపొద్దున్న మీరెలా ప్రవర్తిస్తారో, ఇవాళ ఇంటికి వెళ్లగానే అలా ప్రవర్తించండి... ఇది చెప్పాలనే మీ దగ్గరికి వచ్చాను..." అంటుంటే, కాలేజి బెల్ గణగణ మోగింది. "మళ్లీ మీకు ఫోన్ చేసి, నా ఫ్రెండ్ ద్వారా ఏమన్నా జరిగే అవకాశం ఉంటే వివరంగా చెప్తాను. నిబ్బరంగా ఉండండి. వస్తాను," అంటూ సెలవు తీసుకున్నాడు మధుకర్.

*

సుమతి ఇల్లు చేరేసరికి, ఎర్రగా ఉబ్బిన కళ్లతో వాడిన మొహంతో వంటింట్లో పాలు పొంగిస్తోంది ప్రియ. సుమతి మనసులో భగ్గుమంది. దుఃఖం, కోపం, అవమానం... వాటిని అణుచుకుని, కృత్రిమంగా నవ్వుతూ, "అబ్బో! అమ్మకి కాఫీనా?" అంటూ మొహం కనిపించకుండా బాత్‌రూమ్‌లోకి నడిచింది.

తల దువ్వుకుని, బొట్టు పెట్టుకుని వచ్చేసరికి కాఫీ కలిపి రెండు కప్పుల్లో పోస్తోంది ప్రియ. "పెరట్లో తాగుదామా?" అడిగింది.

వాడిన మొహంతో నటన వదిలేయటానికి నిర్ణ యించుకున్నట్టున్న కూతుర్ని చూడగానే కడుపులో తిప్పింది సుమతికి.

పెరట్లో కూర్చుని కాఫీ తాగుతూ, తల్లి మొహం లోకి చూసి, ఎర్రబడ్డ ఆమె కళ్లు కనిపించగానే, "అమ్మా! ఏమైంది? ఎందుకలా ఉన్నావు?" అంది. సుళ్లు తిరుగు తున్న ప్రేమ, దుఃఖం కలగలిపి.

"ఏంలేదు. ఏదో కాలేజి పాలిటిక్స్," అంది. 'నీలాంటి కృతఘ్నురాల్ని కన్నతల్లికి ఏమవుతుంది?' అనుకుంది మనసులో.

"నువ్వెందుకలా ఉన్నావ్? సెల్‌కి ఫోన్ చేసి రమ్మన్నావు?"

"అమ్మా... నేనొక ఘోరాతి ఘోరమైన తప్పు చేస్తే నన్ను క్షమిస్తావా?" గద్గదంగా అంది ప్రియ నేల చూపులు చూస్తూ.

మనసులో జాలి, ప్రేమలాంటి ఏ భావం కలగక పోయినా, "అదేమిటమ్మా? నువ్వేం తప్పు చేస్తావు?" అంది.

అమాంతం తల్లి ఒళ్లోకి వాలిపోతూ, "అమ్మా! నన్ను క్షమించమ్మా! క్షమించాక నన్ను చంపేసినా సరే," వెక్కుతూ అంది ప్రియ.

ఒక్క క్షణం బిగుసుకుపోయినా, మరుక్షణంలో మధుకర్ మాటలు గుర్తొచ్చి, ఆమె వీపుమీద చేత్తో ప్రేమగా రాస్తూ, "అంత తప్పు పని ఏం చేశావమ్మా?" అంది.

"అమ్మా! ఒళ్లు కొవ్వెక్కి, ఒక పబ్లిక్ ప్లేస్‌లో ఓ మగవెధవ నన్ను తడుముతూ ముద్దు పెట్టుకుంటుంటే నీతిలేనిదానిలా ఒళ్లప్పగించి కూర్చున్నానమ్మా! అమ్మా!... అమ్మా! నాకు ఏ శిక్ష వేసినా తక్కువే... నాకు చావంటే భయం లేదు. నిజంగా లేదు! కాని నేను చచ్చి పోయినా మీకు అపవాదు తప్పదు. మనింటికి మచ్చ తప్పదు," వెక్కివెక్కి ఏడుస్తూ అస్పష్టంగా అంది.

సుమతికి దాచుకున్న దుఃఖం వెల్లువైంది.

"ఎందుకిలా చేశావు తల్లీ? అంత నిగ్రహం మరిచి పోయి ప్రవర్తించేలా పెంచామా నిన్ను?" ఏడుస్తూ అడిగింది.

"లేదమ్మా! ఆ టైంలో ఏదీ గుర్తుకురాలేదు. నువ్వెంత బాగా పెంచావో గుర్తురాలేదు. వాడి అంద

మైన నవ్వూ, వాడి స్టైలు, సినిమాల్లోలా నేనంటే పడి చచ్చే లక్షణం అవే కనిపించాయి... అదో మైకంలాగా...''

కంగారుగా, ''అంటే? ఎంత దూరం? ఎక్కడి దాకా వెళ్లావు?'' అదురుతున్న గుండెతో భయంగా అడిగింది సుమతి.

తల అడ్డంగా ఊపుతూ, ''అంతే అమ్మా! ఇంకేం లేదు,'' అంది.

''ఎందుకు చేశావిలా ప్రియా? నాన్న గుర్తుకు రాలేదూ? పరువుకి ప్రాణం పెట్టే నాన్న జ్ఞాపకం రాలేదూ? ఇంత పెద్ద కాలేజీలో లెక్చరర్ని... నా మొహం జ్ఞాపకం రాలేదూ?'' ప్రియ గడ్డం పట్టుకుని అడిగింది.

''ఇలా జరగడానికి అవకాశం ఉందనుకోలే దమ్మా... ఊరికే చెయ్యి పట్టుకున్నాడు వేళ్లలో వేళ్లు పెట్టి... ఏదో థ్రిల్‌గా అనిపించింది. వాణ్ణి చూసి చాలా మంది అమ్మాయిలు 'హార్ట్‌థ్రోబ్,' అనీ అదనీ ఇదనీ కామెంట్స్ చేస్తూ ఉంటారు. చాలారోజులుగా నా మీద ఇంట్రెస్ట్ చూపిస్తుంటే ఏదో గొప్పగా అనిపించేది...'' తనకు తనే అసహ్యించుకుంటున్నట్టు దీనంగా అంది.

''ఇంట్లో కంప్యూటర్ ఉంటే అక్కడికెందుకు వెళ్లావమ్మా?''

''ఆ సాఫ్ట్‌వేర్ మన కంప్యూటర్లో లేదమ్మా. మా టీమ్‌లో ఇద్దరబ్బాయిలు, ఇద్దరమ్మాయిలు ఉన్నాం. కాలేజి దగ్గరే ఉంది ఆ ఇంటర్నెట్ సెంటర్. కాలేజీలో ఉందిగాని చాలా క్యూ. త్వరగా ఫినిష్ చేసేసి వేరేవి చేసుకోవచ్చు అంటే నిజమే అనిపించి వెళ్లాం.''

''మరి నలుగురూ కలిసి చెయ్యలేదా?''

''మొదటిరోజు ఒకచోటే చేశాం. తర్వాత రెండు సెట్స్‌గా చెయ్యాలనుకొన్నాం. 'నేనూ, ప్రియా ఒకదాని మీద వర్క్ చేస్తాం, మీరిద్దరూ రెండోదాని మీద చెయ్యండి,' అన్నాడు శ్రీకర్. ఐ వజ్ కారీడ్ ఎవే... జస్ట్ చిన్నచిన్న కబుర్లు చెప్పుకోవాలని అనుకొన్నాను. హాల్లో విడివిడి కంప్యూటర్స్ మీద చెయ్యబోతుంటే ఆ సెంటర్ వాడే ఏదో యుపిఎస్ ప్రాబ్లం వచ్చిందనీ, వేరేచోట చెయ్యమని చూపించాడు. ఇపుడు తలుచుకొంటే అంతా ముందుగానే వలవేసి మమ్మల్నిలా ట్రాప్ చేశా డేమో అనిపిస్తుంది... విడివిడి కాబిన్స్‌లో కూర్చుం టుంటే బెరుకనిపించింది. కానీ ఆ అబ్బాయి మిస్చి వస్‌గా నావైపు చూస్తే ఏదో థ్రిల్‌గా ఫీలయ్యాను. 'ఐనో వేర్ టు స్టాప్,' అనుకొన్నాను. మధ్య మధ్యలో కాలి వేళ్లు తగిలిస్తూ, చేతివేళ్లతో ఆడుతుంటే ఏదో గొప్పగా ఫీలయ్యాను. అంతే,'' వెక్కివెక్కి ఏడ్చింది మళ్లీ.

మౌనంగా వింటూ కూర్చుంది సుమతి ఒళ్లో ప్రియ తల నిమురుతూ.

''మూడోసారి వెళ్లినపుడు నా మనసే ఎదురు చూసింది ఎపుడెపుడు వెళ్తామా అని. వెళ్తే అతను, 'ఐ లవ్యూ,' చెప్తాడేమో అనే ఊహతో ఎంత తహతహలాడి పోయానో...'' తనతో తనే చెప్పుకొంటున్నట్టు ఇంగ్లీషులో అంది.

''ఆరోజు మౌస్ మీద చెయ్యిపెట్టగానే తను కూడా నా చేతిమీద చెయ్యిపెట్టి క్లిక్ చెయ్యడం మొదలుపెట్టాడు. తప్పని తెలిసినా ఆపలేదు...''

''ప్రియా! నీకు పెళ్లి చేసుకొని సెటిల్ అవాలని ఉంటే చదవమని బలవంతం పెట్టేవాళ్లమా? ఎందు కలా చేశావు?'' రుద్ధకంఠంతో అడిగింది.

ఒడిలోంచి లేచి, రేగి కన్నీటికి తడిసిన జుట్టుతో చేతులు పక్కల వేళ్లాడేస్తూ, ''అమ్మా! ఏదీ దాచను. ఉన్నదున్నట్టు చెపుతున్నాను. నీకెంత అసహ్యం వేసినా సరే... నా చెంపలు పగల గొట్టాలనిపిస్తే కొట్టు...'' అంది.

''నువ్వు నిజం నిర్భయంగా చెపుతున్నావు కనకే అడుగుతున్నాను. నాన్న ఫ్రెండ్ కొడుకు ప్రపోజల్ వచ్చి నపుడు, చిన్నత్త తన కొడుకు కోసం అడిగినపుడూ ఎందుకంత రాద్ధాంతం చేశావు వద్దని?'' నిస్సహాయం గా, బాధగా అడిగింది.

''అమ్మా! పెళ్లి వేరు, రొమాన్సు వేరు. ఈ వయసులో ఎవరూ పెళ్లి చేసుకోవాలనుకోరు.''

''ప్రియా! ఇదా నువ్వు మనింట్లో నేర్చుకొన్న సంస్కారం? ఐ ఫీల్ ఎషేమ్డ్...''

''నాకు తెలుసమ్మా. నాకు నేనే నీచాతినీచంగా కనిపిస్తున్నాను. నన్ను చూసి నువ్వు సిగ్గు పడుతున్నా వంటే ఆశ్చర్యం లేదు. నేనింతగా ఎలా దిగజారానో నాకే తెలియదు. నా జీవితాన్ని ఒక్క పదిరోజులు వెనక్కి తిప్పగలిగితే బావుణ్ణు!''

''పోన్లే... అయిందేదో అయింది. ఇప్పటికైనా నువ్వు మారితే చాలు.''

''అమ్మా! అంతా చెప్పలేదింకా. నా మెళ్లో రోజూ వేసుకొనే గొలుసు ఏమయిందని అడగలేదు నువ్వు.''

''అపుడపుడు మార్చుకొంటావుగదా అనుకొ న్నాను.''

కళ్లు దూరంగా ఉన్న చెట్టు వైపుకి తిప్పి, తల్లి మొహం చూడలేనట్టుగా, ''వాడు... అదే ఆ కేఫ్ ఓనర్, మా ఇద్దర్నీ తెలియకుండా వీడియో తీసి, పదివేలిస్తే ఆ కాసెట్ ఇస్తానని, లేకపోతే కాలేజీ స్టూడెంట్స్‌కి అది

కాపీలు తీసి అమ్ముతానని బెదిరించాడు,'' బుగ్గల మీద కాలువలా ప్రవహిస్తున్న నీటిని తుడుచుకొంటూ, ''శ్రీకర్ అయిదువేలు తెచ్చాడు. నేను నా గొలుసు అమ్మేసి మిగిలింది కట్టమని శ్రీకర్‌కిచ్చాను. పదివేలు తీసుకొని, ఆ కేసెట్ శ్రీకర్‌కి ఇచ్చాడు వాడు. ఇది జరిగి వారమైంది.''

''వారం క్రితం ఇంత జరిగితే ఒక్క ముక్క నాతో చెప్పలేదు...''

''ప్రమాదం తప్పింది. ఇంక జీవితంలో ఎపుడూ ఇలాంటి పరిస్థితి రానివ్వననుకొన్నాను. కానీ వాడు అప్పటికే ఆ కేసెట్‌తో ఇంకో సిడి చేసి పెట్టుకొన్నాడు. ఇప్పుడు ఇంకో ఇరవైవేలు ఇమ్మనీ, ఇవ్వకపోతే దాన్ని న్యూస్‌పేపర్లకి అమ్ముతానని బెదిరిస్తున్నాడు... ఇలా వాడు ఎన్ని కాపీలైనా తీయగలడు... దీన్నించి ఇంక విముక్తి లేదు,'' అదిరే పెదవులతో, నిస్తేజమైన కళ్లతో అంది.

శ్రీకర్, మధుకర్‌కి ఆ కేసెట్ ఇవ్వడం గుర్తొచ్చి, ''ఆ కేసెట్ ఏది?'' అనడిగింది సుమతి.

''శ్రీకర్ దగ్గరుంది.''

''ఎంత స్టుపిడ్‌వే ప్రియా! అంత డబ్బిచ్చి, ఆ కేసెట్ తీసుకొని, ఇంకో పరాయివాడి దగ్గర వదిలేసి, సేఫ్‌గా ఎలా ఫీలయ్యావు? ఎంత వెర్రిదానివి?''

ప్రియ కళ్లప్పగించి తల్లిని చూసింది కొంతసేపు. తర్వాత నీటిచెలమల్లాంటి కళ్లతో, ''అమ్మా! శ్రీకర్ అలాంటివాడు కాదు. అయినా ఆ కేసెట్ నా దగ్గరే ఉన్నా ఏం లాభం? కేశవ దగ్గర కాపీ ఉన్నంత కాలం సేఫ్టీ ఏది? ఇపుడు నేను పాస్ట్‌లోకి వెళ్లి జరిగిపోయిన దాన్ని మార్చలేను. ఈ మెస్ క్లియరవుతుందంటే ఐ కెన్ కిల్ మై సెల్ఫ్...'' పోరాటానికి రాజీనామా చేసినట్టుగా అంది ప్రియ.

''ప్రియా! ఎప్పుడూ అలా మాట్లాడకు. నువ్వు తల్లివైతేగాని తల్లి బాధ నీకు తెలియదు. తన బిడ్డని పోగొట్టుకొన్న తల్లి, తన ఆఖరి శ్వాస వరకు ఎంత ఏడుస్తూ బతుకుతుందో. పిల్లలు తల్లిదండ్రుల ప్రేమ అందుకొంటూ పెరిగి పెద్దవుతారు. ఆ జీవితం, ఆ ప్రాణం వాళ్ల సొంతం అనుకొంటారు. జీన్స్ ద్వారా సంక్రమించిన టాలెంట్స్, అందచందాలు తమ సంపాదనలాగా భావిస్తూ అహంకారం పెంచుకొంటూ, ఏదైనా కష్టం వస్తే, చిటికెలో ఆ ప్రాణం తీసుకోవడం... అంతా వాళ్లిష్టమేనా? కలలుకని, వాళ్లని కని, సంవత్సరాల తరబడి పెంచి, ఆశల శాఖలు ఏళ్ల తరబడి విస్తరింపజేసుకొంటూ, ఆ నీడన సేదతీరాలని ఎదురుచూసే తల్లిదండ్రుల్ని ఎడారిలో వదిలేసి, ప్రాణం తీసుకొనే హక్కు వాళ్లకెవరిచ్చారు. వాళ్లు ఎదుర్కొని ఉండాల్సిన కష్టంతోపాటు, వాళ్ల చావు కష్టాన్ని కూడా కని పెంచిన పాపానికి వీళ్లనే భరించమనడం న్యాయమేనా?'' ఏడుస్తూ ఆవేశంగా అడిగింది సుమతి.

విభ్రాంతిగా తల్లిని చూస్తుండిపోయింది ప్రియ. ''ఇలాంటి పని చేశాక కూడా నన్నలాగే ప్రేమిస్తావా అమ్మా!'' అనడిగింది మాటలు కూడదీసుకొంటూ.

''ప్రియా! తన పిల్లల్ని ఎలాంటి పరిస్థితిలో అయినా ప్రేమించని తల్లి ఉండదమ్మా. చాలా దుఃఖం, అవమానం, ఆక్రోశం కలిగినపుడు ఏ తల్లయినా తన పిల్లల్ని, 'ఇంతకన్నా నువ్వు చచ్చిపోయినా బావుండేదని,' అన్నా అనొచ్చుగాని, అలా జరగాలని ఎప్పుడూ కోరుకోదు. అలాగే జరిగితే ఆ తల్లి అనుక్షణం చస్తూనే బతుకుతుంది జీవితాంతం!'' ప్రియ గడ్డం పుచ్చుకొని ఆ కళ్లలోకి చూస్తూ దీనంగా, అభ్యర్థనగా అంది సుమతి.

తల్లి చెంపలు తన దోసలి మధ్య పట్టుకొని ఆమె కళ్లలోకి చూస్తూ ఒక నిముషం పాటు ఉండిపోయింది ప్రియ. మెల్లిగా ఆ చేతులు ఆమె చుట్టూ వేసి గాఢంగా ఆలింగనం చేసుకుంది... ''అమ్మా... ఐ లవ్యూ... ఇంక ఎప్పుడూ చావు గురించి ఆలోచించను. నే చేసిన పని తాలూకు ఫలితం ఏదైనా భరిస్తాను. ఏ పనైనా చేసే ముందే ఫలితం గురించి ఆలోచించటానికి ప్రయత్నిస్తాను. నీకూ, నాన్నకీ తలవంపులు తెచ్చే పని ఎప్పుడూ... ఎప్పుడూ చెయ్యను. ప్రామిస్,'' అంది గద్గదకంఠంతో.

*

తల్లితో అంతా చెప్పాక హృదయభారం కొంత తేలికై, తల్లి బలవంతాన తినిపించినదేదో తిని త్వరగా నిద్రపోయింది ప్రియ. సుమతికి అన్నం తినాలనిపించలేదు. వంటిల్లు సర్దేసి, కొలిక్కి రాని ఆలోచనల మధ్య భర్తకు ఫోన్ చేసింది. షెడ్యూల్ ప్రకారం అతను మర్నాడు రావాలి. అయినా ఏదైనా మార్పు ఉందేమో తెలుసుకొందామనుకొంది. ఎన్నిసార్లు చేసినా అతని సెల్ ఆఫ్‌లో ఉంది. ఇలాంటి సమస్యని ఎవరితో పంచుకోవచ్చో అర్థం కాలేదు. మనసు ఎంతో భారంగా తయారైంది. పదిగంటల వేళ ఆఖరిసారి ప్రయత్నం చేసి పడుకొందామనుకొంటుంటే ఫోను మోగింది. అతనే అయి ఉంటాడని ఆత్రంగా తీసింది.

''మేడమ్! నేను మధుకర్‌ని,'' అన్నాడు అవతలి వైపు నుంచి.

''మధుకర్! బాబూ! నీకో రిక్వెస్ట్. నీ దగ్గరున్న కేసెట్ నాకిచ్చెయ్యి నాయనా,'' వేడుకొంటున్నట్టు అంది.

అవతలివైపు ఒక క్షణం మౌనం. "మేడమ్! ఆ విషయంలో మీకేం భయం వద్దు. ఇప్పుడే కావాలన్నా వచ్చి ఇస్తాను. అలా వేడుకొని నన్ను ఇన్సల్ట్ చెయ్యకండి..." మధ్యలో ఆగి, "ప్రియ ఎలా ఉంది? మాట్లాడిందా?" అనడిగాడు.

తన రెస్పాన్స్‌కి సిగ్గుపడుతూ, "ఆ... చాలాసేపు అంతా చెప్పింది," అంది సుమతి.

"నేను మా నాన్నగారితో అంతా చెప్పాను. నాన్నగారు బాగా అర్థం చేసుకొన్నారు. ఇద్దరం కలిసి నా ఫ్రెండ్... అదే ఏసిపి అని చెప్పాను కదా... వాడింటికి వెళ్లాం. లక్కీగా ఇది వాడి జ్యూరిస్‌డిక్షన్ కిందకే వస్తుంది. శ్రీకర్‌కి ఇరవైవేలిచ్చి, ఆ కేశవ్‌గాడి దగ్గరికి పంపమని, వెనకాలే తను సెంటర్‌ని రెయిడ్ చేస్తానని చెప్పాడు వాడు."

ఊపిరి బిగబట్టి వింటోంది సుమతి.

"అతను ప్రియని, శ్రీకర్‌ని ఇద్దరినీ పంపమన్నాడుగానీ, ఎంత గోప్యంగా చేసినా పని సజావుగా పూర్తయ్యేవరకు రిస్కే. మీడియాకి తెలిసిందంటే ఫోటోలు తీసేసి హంగామా చేస్తారని రిక్వెస్ట్ చేశాను. పకడ్బందీగా ప్లాన్ చేసి, ఆ ఇంటర్నెట్ సెంటర్‌ని రెయిడ్ చేశారు. వాడి దగ్గర ఉన్న సిడిలు, కేసెట్స్ అన్నీ సీజ్ చేశారు. ఈ న్యూస్, మీడియాకి రిలీజ్ చేసినా ఎవరి పేర్లూ బయటికి రాకుండా చూస్తానని మావాడు ప్రామిస్ చేశాడు. రెండ్రోజుల్లో ఆ సిడిలన్నీ చెక్ చేసి అలాంటి దరిద్రపు సిడిలన్నీ డిస్ట్రాయ్ చేసేస్తారు. అంతా సజావుగా జరిగితే, ఈ బురదగుంట నుంచి మనం బయటపడ్డట్టే... మీరు బెంగపడుతూ ఉంటారనిపించి ఫోన్ చేశాను. ప్రశాంతంగా నిద్రపోండి... గుడ్‌నైట్."

సుమతి రెస్పాన్స్ కోసం ఎదురుచూడకుండా ఫోన్ పెట్టేశాడతను. ఆమె మనసంతా అతని పట్ల కృతజ్ఞతతో నిండిపోయింది. చెమర్చిన కళ్లతో, 'భగవాన్! అంతా సవ్యంగా జరిగి ఆపద నుంచి గట్టెక్కేలా చెయ్యి తండ్రీ!' ప్రార్థించుకొంది. భర్తకి మరోసారి ఫోన్ చెయ్యాలని ప్రయత్నించి కనెక్షన్ దొరక్కపోవడంతో మెల్లిగా వెళ్లి ప్రియ పక్కన పడుకొంది. నిద్ర కోసం ఎంత ప్రయత్నించినా, పరిపరివిధాలా పోయే మనసు అందుకు సహకరించలేదు. వారం కిందటి నుంచి ప్రియ ప్రవర్తన, తన అశ్రద్ధ, గమనింపు లేకపోవడం, ఇరవై నిముషాల పాటు ఆ కేసెట్‌లో కనిపించిన దృశ్యాల ఊహలు, మధుకర్ మంచితనం, దూరదృష్టి, అరెస్టయిన కేశవ్ ఎలా రియాక్టవుతాడో అనే భయం... సాలెగూడులో చిక్కుకొన్న పురుగులా, ఆలోచనల్లో గిలగిలలాడుతూ రాత్రంతా గడిపింది సుమతి. ఆ సిడిలు పోలీసుల చేతికి చిక్కితే గోప్యంగా ఉంచుతారా? ఆలోచించినకొద్దీ వణికింది ఆమె మనసు. అశాంతంగా అటూ ఇటూ పొర్లుతూ తెల్లవారుఝామున నిద్రలోకి జారుకొంది.

అంధకారం... ఎక్కడో దూరంగా మిణుకుమనే వెలుగులు... రిక్షాలో తను, ప్రియ... భయపడుతున్నట్టే రిక్షాని అటకాయించి, ప్రియని చేతులు పట్టి లాగుతూ రౌడీలు. దూరంగా పోలీసులు. ఏం చెయ్యకుండా అలా నిలుచుని చూస్తారేం? అరవాలన్నా గొంతు పెగలని అసహాయత... గింజుకొంటున్న ప్రియ ఒక్కసారిగా కెవ్వుమని అరిచింది. తారాస్థాయిలో అలా అరుస్తూనే ఉంది ఆపకుండా. ఉలిక్కిపడి లేచింది సుమతి. కలా?... కల కాదు. ప్రియ ఇంకా అరుస్తూనే ఉంది. దిగ్గున మంచం దిగి, చీర కాళ్లకి అడ్డం పడుతుంటే, ముందు హాల్లోకి పరుగుపెట్టింది! సోఫాలో కూర్చున్న ప్రియ గుడ్లు మిటకరించి కీచుగా అరుస్తోంది, హడిలిపోతూ.

"ప్రియా! ఏమైంది? ఏం జరిగింది?" ఆమె భుజాలు పట్టుకొని బలంగా కుదిపేసింది సుమతి.

సుమతిని గట్టిగా కరుచుకుపోయి వణికిపోతోంది ప్రియ. దిక్కు తోచనిదానిలా చుట్టూ చూసింది సుమతి. టీపాయ్ మీద ఆవేళ్టి న్యూస్‌పేపర్ మొదటి పేజీలో ఉరికి వేళ్లాడుతున్న అమ్మాయి ఫోటో. 'కాలేజీ విద్యార్థిని ఆత్మహత్య,' పెద్ద అక్షరాలతో రాసి, 'ఇంటర్ 'నెట్'లో చిక్కుకొన్న ఇందిరా కాలేజీ విద్యార్థులు,' అని కొంచెం చిన్నక్షరాల్లో రాశారు. గుండె గుభిల్లుమంది సుమతికి. ప్రియని అలా పట్టుకొనే ఆ వార్త గబగబా చదివింది. ఆత్మహత్య చేసుకొన్న రాగిణి పేరు తప్ప విద్యార్థులవి ఇంకెవరి పేర్లూ రాయలేదు అందులో. కింద పోలీస్ ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్స్ మధ్యగా మర్యాదస్తుడిలా కనిపిస్తున్న ముప్పై నలభై సంవత్సరాల యువకుడి ఫోటో. దాని కింద రాత్రి జరిగిన పోలీస్ రెయిడ్ గురించి రాశారు. తరువాయి భాగం కోసం లోపలి పేజీ తిప్పింది ఆందోళనగా. లోపల, గుండెలు బాదుకొంటూ ఏడుస్తున్న రాగిణి తల్లీ, బంధువులు వున్న ఫోటో. వణుకుతూ అక్షరక్షరం చదివింది సుమతి. మనసంతా వికలమైనా ఎక్కడో రిలీఫ్... భుజంమీద, ఏడుస్తూ ఏదేదో మాట్లాడుతున్న ప్రియ మీదకి దృష్టి మళ్లింది అప్పటికి. "నా కేర్‌లెస్‌నెస్ వల్లే... అది చచ్చిపోయిందమ్మా. నిన్న అది ఫోన్ చేసినపుడు చావాలని

ఉందే అంది... అయినా నేనేం చెయ్యలేదు. పైగా నాకూ అలాగే ఉందన్నాను, నేను హాయిగా నిద్రపోయాను. అది చచ్చిపోయింది...'' పక్కలెగిరి పడేలా గట్టిగా ఏడుస్తోంది ప్రియ.

``ప్రియా! తల్లీ!'' ప్రియ మొహాన్ని తన చేతుల మధ్యకి తీసుకొంటూ అనునయంగా పిలిచింది సుమతి.

ఏమీ వినిపించనట్టు, ``నిన్న నేనింటికి వచ్చేసరికి ఫోను మోగుతోంది. ఎన్నోసార్లు చేసిందిట అది...'' చెప్పుకుపోతోంది ప్రియ అస్పష్టంగా.

గట్టిగా, ``ప్రియా!'' అని పిలిచింది సుమతి కమాండింగ్‌గా. ప్రియ సడన్ బ్రేకు పడ్డట్టు తల్లిని చూసింది.

``నీకు నువ్వు సాయం చేసుకోలేని పరిస్థితిలో ఎవరికో సాయం చెయ్యలేదని బాధపడడంలో అర్థం ఉందా? ఆ అమ్మాయితో పాటు నువ్వూ చచ్చిపోలేదని బాధపడుతున్నావా?'' గట్టిగా అని, ``అమ్మలూ! నా తల్లివి గదూ! నీకు నువ్వే ఒక్కసారి పరిస్థితిని సమీక్ష చేసుకో... నువ్వేం చెయ్యలేదో... దానికన్నా... నువ్వేం చెయ్యాలో ఆలోచించుకో. నాకింకా కొత్త శిక్షలు విధించకు. లే... లేచి చల్లని నీళ్లతో స్నానం చేసిరా. కాఫీ కలుపుతాను,'' అంటూ బలవంతాన ప్రియని బాత్‌రూమ్‌లోకి తోసి, వంటింట్లోకి నడిచింది. పాలు స్టవ్ మీద పెట్టి పేపర్ ఆసాంతం చదువుతూ, మధుకర్‌ని తలుచుకొంది. 'బాబూ! నీలాంటి వ్యక్తి భరోసా దొరకకే రాగిణికి ఇలా జరిగింది. నీవల్లే నా కూతురు నాకు దక్కింది. నిన్నెంత పొగడినా తక్కువే,' అనుకొంటూ రాగిణి తల్లి ఫోటో చూస్తూ కళ్లు తుడుచుకొంది.

*

'ఆరోజు అల్లకల్లోలమైన మనసుతో, దిక్కు తోచని స్థితిలో శ్రీకర్ ఇంటికి వెళ్లినపుడు, తలుపు తెరిచిన మధుకర్‌ని ఎంత తిట్టుకొందో. ఆరోజు అతను తటస్థ పడకపోతే తన జీవితం ఎలా ఉండేదో. అమ్మ తనను క్షమించి అక్కున చేర్చుకోకపోయి ఉంటే తనూ రాగిణిలాగే...' ఆలోచనల్లో మునిగిపోయిన ప్రియ కారు ఇంటి దగ్గర పోర్టికోలో ఆగేసరికి ఇహలోకంలోకి వచ్చింది. ప్రమోద్ దిగి డోర్ వేస్తుంటే గమనించినా అలా స్తబ్ధుగా ఉండిపోయింది. చుట్టూ తిరిగి వచ్చి ప్రియ వైపు తలుపు తెరిచి, తన చెయ్యి అందిస్తూ, "నడిచి వస్తావా? లేక...'' అర్ధోక్తిలో ఆగాడు, కొంటెగా, సెలయేరులా తుళ్లిపడే ప్రియ ఈరోజింత మౌనంగా ఎందుకుందో అనుకొంటూ. ప్రేమగా భర్తను చూస్తూ, ఆ చేతిని అపురూపంగా అందుకొని కారు దిగింది ప్రియ.

``దేని గురించో అంత దీర్ఘాలోచన...'' మెట్లవైపు నడుస్తూ అడిగాడు.

``ఆలోచనా...'' నవ్వి, ``యుపిఎస్ గురించి! హఠాత్తుగా కరెంటుపోతే, అప్పటిదాకా చేసిన వర్క్ సేవ్ చేసుకొనేదాకా, ఆ పావుగంటో అరగంటో సపోర్ట్ ఇచ్చే యుపిస్ ఎంత అవసరమో కదా!'' అంది ప్రమోద్ వైపు చూస్తూ.

ఫక్కున నవ్వుతూ, ``ఒకోసారి ఒట్టి చిన్నపిల్లలా ప్రవర్తిస్తావు కదా. ఇంత అద్భుతమైన సాఫ్ట్‌వేర్‌నీ, కంప్యూటర్ లాంటి గొప్ప సృష్టినీ వదిలేసి యుపిఎస్‌ని పొగుడుతున్నావు!... లిటిల్ బేబీ...'' ఆమె తల మీద ఆపేక్షగా చేత్తో తాకి, బుర్ర ఊపి, ఇంట్లోకి నడిచాడు ప్రమోద్.

రాగిణిని, ఆ జ్ఞాపకాలనీ మెదడు పొరల కింద నిక్షిప్తం చేసేసి, ప్రమోద్ వెంట లోపలికి నడిచింది ప్రియ. వీధి తలుపు మూసుకొంది. పోర్టికో మీంచి కిందకి వేలాడే జాజితీగ పూలమీద లోపల వెలిగిన ట్యూబులైటు వెలుగు పరుచుకొంది. లోపలికెళ్తూనే ప్రమోద్ అలవాటుగా మీట నొక్కడంతో, టేప్ రికార్డర్ లోంచి పాట వెలువడింది. ఆ చల్ కె తుఝె మై లేకె చలూ... అంటూ.

వెనకే ప్రియ సన్నని నవ్వు మృదువుగా వినిపించింది. కష్టాలు, కన్నీళ్లూ లేని లోకం ఎక్కడుంటుంది? అయినా సమస్యలు చుట్టేసి అంతటా అంధకారమే కమ్మేసినట్టు కనిపించేటపుడు, అలాంటి లోకానికి తీసుకెళ్తానని ఎవరైనా ఆశావహంగా చెప్పి, నమ్మించగలిగితే చాలదూ?

*సుజనరంజని (అమెరికా), అక్టోబర్ 2005*

